సంఘం నిధులు స్వాహా.!

గ్రామైక్య సంఘాల్లో వెల్లడైన రూ.32లక్షల అక్రమాలు
- రికవరీనా..లేక క్రిమినల్ కేసులా?
- పాస్‌బుక్ అప్‌డేట్ చేయకపోవడంతోనే వీఓల అక్రమాలు


వడిచర్ల వీఓఏ సంఘాల్లో జరిగిన అక్రమాలపై ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

లింగాలఘణపురం : మండలంలోని వడిచర్ల గ్రామైక్య సంఘాల్లో రెండేళ్లుగా వీఓఏలు అక్రమాలకు పాల్పడుతున్నారు. అయితే రెండు, మూడేళ్లుగా ఆయా బ్యాంక్‌ల్లో సంఘాలకు సంబంధించిన పాస్‌బుక్‌లను అప్‌డేట్ చేయకపోవడంతో అక్రమాలకు అవకాశం దొరికింది. వడిచర్లలోని మదర్ థెరిసా, అంకిత గ్రామైక్య సంఘాల నిర్వహణ చేసే వీఓఏలు రూ.32,00,970ల అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వం ఇటీవల పావలా వడ్డీ విడుదల చేయడంతో ఆయా వీఓఏలు వారి అకౌంట్ల బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకోవడంతో అక్రమాలు బయటపడ్డాయి. దీంతో సంఘం సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా జనవరి 5వ తేదీ నుంచి గ్రామంలోని 59 సంఘాల్లో ఆడిట్ మొదలు పెట్టడంతో మదర్ థెరిసా వీఓలో 10 సంఘాల్లో వీఓఏ రూ.20,80,697, అంకిత గ్రామైక్య సంఘంలో వీఓఏ రూ.11,20,873లు అక్రమాలకు పాల్పడినట్లు ఆడిట్‌లో వెల్లడైంది.

వీఓఏలపై చర్యలు?

వడిచర్ల గ్రామైక్య సంఘంలో అక్రమాలకు పాల్పడిన వీఓఏలు పదిహేను రోజుల్లోగా డబ్బులు చెల్లించకపోతే వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌లో భాగంగా క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇటీవలే డీఆర్‌డీఓ ఆ వీఓఏలను పిలిపించి అక్రమాలకు పాల్పడిన నిధులు చెల్లించాలని ఆదేశించినట్లు తెలిసింది.

చర్యలు తీసుకుంటాం..

వడిచర్ల మహిళా గ్రామైక్య సంఘాల్లో వీఓఏలు పాల్పడిన అక్రమాలకు సంబంధించి నివేదిక సిద్ధమైంది. సంఘాల వారిగా జరిగిన అక్రమాలపై గ్రామంలో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారుల సూచనల మేరకు వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

– శంకరయ్య, ఏపీఎం, లింగాలఘణపురం

అక్రమాలు బయట పడింది ఇలా..

స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి నుంచి గ్రామైక్య సంఘం సభ్యుల అవసరాల నిమిత్తం రుణాల ఇస్తుంటారు. స్త్రీనిధి నుంచి రుణాలు తీసుకున్న సభ్యులు ప్రతి నెల గ్రామైక్య సంఘానికి చెల్లిస్తారు. వడిచర్లలో కూడా అదేవిధంగా గ్రామైక్య సంఘం నుంచి రుణాలు తీసుకున్న సభ్యులు ప్రతి నెల చెల్లించినప్పటికీ వీఓఏ (విలేజ్ ఆర్గనైజింగ్ ఆఫీసర్) సభ్యుల నుంచి వసూలు చేసిన నగదును సొంతానికి వాడుకొని గ్రామైక్య సంఘం అకౌంట్‌లో నుంచి చెక్ రాసి జమ చేయడం జరిగింది. దీంతో ఏ అధికారికి కూడా అనుమానం రాలేదు. ప్రతి నెల ఆయా సంఘాల నుంచి సభ్యులు తీసుకున్న రుణాలు రికవరీ సక్రమంగా జరుగుతున్నట్లుగా రికార్డుల్లో చూపించడంతో బయట పడలేదు. అంతేకాకుండా పాస్ బుక్‌ల అప్‌డేట్ లేకపోవడంతో గ్రామైక్య సంఘం అకౌంట్ బుక్‌ల వివరాలు కూడా ఎవరికి తెలియలేదు. ఇదిలా ఉండగా అంకిత గ్రామైక్య సంఘం వీఓఏ ఓ బ్యాంక్‌లో బ్యాంక్ మిత్రగా పని చేయడంతో అదేబ్యాంక్‌లో సంఘాల సభ్యులు జమ చేసిన పొదుపులో కొంత సొంతానికి వాడుకొని, మరికొంత అకౌంట్‌లో జమ చేయడం, ఆ బ్యాంక్ అధికారులు పాస్ బుక్‌ల అప్‌డేట్ చేయకపోవడంతో అక్రమాలు బయటపడలేదు. ఇటీవల పావలా వడ్డీ రావడంతోనే ఈ అక్రమాలు బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకోవడంతో బయటపడ్డాయి.

తిడుగు గ్రామాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జఫర్‌గఢ్ : మండలంలోని తిడుగు గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక యువకులు ఎమ్మెల్యేను హనుమకొండలోని తన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారుల మరమ్మతులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, చెక్‌డ్యాం తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరడంతో ఎమ్మెల్యే శ్రీహరి సానుకూలంగా స్పందించారు. గర్మిళ్లపల్లి నుంచి తిడుగు మీదుగా సాగరం క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. వచ్చే జూలైలోగా పనులు పూర్తి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. గ్రామీణ యువత బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు రాజకీయాల్లో కూడా రాణించాలని సూచించారు. తాను ఈ స్థాయిలో ఉండడానికి చదువే ప్రధాన కారణమని పేర్కొంటూ యువత చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘హామీల అమలులో విఫలం’


నిరసన వ్యక్తంచేస్తున్న కార్మిక సంఘం నాయకులు

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు తాడెం రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్లకార్డులు ప్రదర్శిస్తు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అందించే భరోసాకు ఈజీఎస్ పనులకు లింక్ పెట్టడం సరికాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలను ముంచే బడ్జెట్ అని, వెంటనే దాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. నేడు (సోమవారం) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు అన్ని వర్గాల ప్ర జలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కా ర్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇంజ ఎల్లయ్య, నా యకులు గంగరబోయిన సమ్మయ్య, నీల మ ణెమ్మ, లక్ష్మి, కళమ్మ, కనకమ్మ పలువురు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఎంచుకోవాలి


బహుమతులు అందజేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్ : విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం, అవోపా సేవా సంఘం నాయకులు సురేష్, బెలిదే పూర్ణచందర్ కోరారు. మండల కేంద్రంలో అవోపా, డీటీఎఫ్ సంయుక్తంగా పదోతరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టుకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి సబ్జెక్ట్‌పై పట్టు సాధించినప్పుడే ఉన్నతంగా రాణిస్తారన్నారు. మార్చిలో జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని వారు కోరారు. అనంతరం పోటీ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో దొడ్డ రాజ్‌కుమార్, బోనగిరి శ్రవణ్‌కుమార్, గందె సోమన్న, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటాచార్యులు, బజ్జూరి మెడికల్ కృష్ణమూర్తి, బెలిదె హరిశంకర్, అక్షిత్, అజిత్‌ఖాన్ పాల్గొన్నారు.

కురుమలకు అధిక సీట్లు కేటాయించాలి


నియామక పత్రం అందజేస్తున్న జిల్లా నాయకులు

పాలకుర్తి టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికలో కురుమలకు అన్ని రాజకీయ పార్టీలు అధిక సీట్లు కేటాయించాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్, జిల్లా యూత్ అధ్యక్షుడు చేవెళ్లి మధుసూదన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ కులస్తులందరూ ఒక తాటి పై ఉండి రాజకీయాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా విస్నూరు గ్రామానికి చెందిన నోముల సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బేజారి సురేష్, ఉపాధ్యక్షుడిగా కొలుపుల సుధాకర్, మల్లేష్, కర్ర రవీందర్, మండల ప్రధాన కార్యదర్శిగా మల్లాల పరుశరాములు, ప్రచార కార్యదర్శిగా చేబెల్లి శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా గుండు శ్రీనివాస్, మంగ శ్రీశైలం, జోగు భిక్షపతి, కోశాధికారిగా మారుజోడు చంద్రం, కార్యవర్గ సభ్యులుగా మొటిక బీరప్ప, మజ్జిగ కుమారస్వామి ఎన్నికయ్యారు. కురుమ సంఘం యూత్ అధ్యక్షుడిగా శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా పడిశ అశోక్, శ్రీనివాస్, మండల కార్యదర్శిగా చేబెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

అధ్వానంగా పల్లెప్రకృతి వనం


వనంలో చెత్తను చూపుతున్న స్థానికుడు

రఘునాథపల్లి : మండలంలోని గబ్బెట గ్రామ పల్లె ప్రకృతి వనం అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కారణంగా అధ్వానంగా మారింది. పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన పల్లె ప్రకృతి వనం గ్రామ పంచాయతీ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. దీంతో కొందరు రైతులు పల్లె ప్రకృతి వనంలో పొగాకు పంటను ఎండబెడుతున్నారు. పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు, చెట్లకు నీరులేక ఎండిపోతున్నాయి. అలాగే ఎటూ చూసినా చెత్తా చెదారంతో నిండిపోయింది. సమస్య పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై తగు చర్యలు తీసుకొని, పల్లె ప్రకృతివనాన్ని రక్షించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులును వివరణ కోరగా.. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయని, అయినా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం నిర్వహణ నిర్లక్ష్యంపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా..


బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక్కొక్క కుటుంబానికి రూ.25వేల చొప్పున ఆదివారం బాధితులకు పంపించగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న ఆధ్వర్యంలో అందించారు. అదేవిధంగా బెలిదె వెంకన్న తనవంతుగా ఒక్కో కుటుంబానికి క్వింటా చొప్పున మూడు కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నూకల ఐలయ్య, దైద ఎలిషన్, మందపురం ఎల్లగౌడ్, తోట వెంకన్న, గొడుగు రాజయ్య, లింగనబోయిన శ్రీనివాస్, మంద రాజు, పల్లె రవీందర్, అజయ్‌రెడ్డి, యాదగిరి, రామక్రిష్ణ, గట్టుమల్లు, మల్లయ్య, సీపీఎం నాయకులు మునిగెల రమేష్, మల్లారెడ్డి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన పబ్బతి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న పరామర్శించారు. వెంకట్‌రెడ్డి మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే శివునిపల్లి గ్రామానికి చెందిన బైరు మల్లికాంబ ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యులకు గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు..

జఫర్‌గఢ్ : మండలంలోని ఉప్పుగల్లులో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేశ్ మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల మృతిచెందింది. కాగా వరంగల్ మేయర్ గుండు సుధారాణి, విశాఖపట్నం మెట్రోపాలిటిన్ ఆర్చ్ బిషప్ ఉడుమల బాలశౌరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహరెడ్డి, చైర్మన్లు బిల్లా ఉదయరెడ్డి, రాజేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు జువారి రమేష్, యాకూబ్‌పాష, సమ్మయ్య ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి


మాట్లాడుతున్న రమేశ్

జఫర్‌గఢ్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పుగల్లులో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇవ్వడం జరిగిందని, వాటిని అమలు చేసే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రుణమాఫీ హామీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఇప్పటి వరకు రూ.2లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా హామీలను వెంటనే నెరవేర్చాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా, పార్టీ గ్రామ కార్యదర్శి పెండ్యాల సమ్మయ్య, ఎండీ జాఫర్, సాయిలు, రాజు, రాములు, రవి, లక్ష్మయ్య, సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను సీపీఐ నాయకులు పరామర్శించారు.

కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష



కొడకండ్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు సంతానం కలిగి ఉండకూడదనే నిబంధనను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ జీసీసీ మాజీ చైర్మన్ అభిమాన్‌గాంధీ నాయక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరింది. మండలంలోని గిర్నితండాలో ఆమరణ నిరాహార దీక్ష కొనసాగించిన అభిమాన్ గాంధీ నాయక్‌కు దీకొండ రమేష్, సురేష్ నాయక్, వెంకన్న, రాజ్‌కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్ : సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను పాటించని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్(పీఆర్ఓ) విద్యాశాఖ కార్యాలయం ఏడీపై చర్యలు వెంటనే చర్య తీసుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు బి.చొక్కయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలు గడిచినా సమాచారం ఇవ్వడంలేదని అన్నారు. ఇదేవిషయంపై డీఈఓ రమేష్‌ను వివరణ కోరగా దరఖాస్తుదారుడు అడిగిన సమాచారం అందించామని ఎలాంటి వివరాలు కావాలన్నా ఇస్తామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో 2002–03 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రాజవరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్‌రెడ్డి, సంధ్య, పద్మ, కుర్షీదా, పూర్వ విద్యార్థులు వేముల రవికృష్ణ, ఆకుల శ్రీధర్, శవ్వాల రాజు, గట్టు రామకృష్ణ, రాపర్తి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నిక



జనగామ రూరల్ : మండలంలోని పెంబర్తి గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంబాల రఘునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆదివారం కాంగ్రెస్ గ్రామ శాఖ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆత్మకూరు స్వామి, ఎంబరీ హన్మంత రావు, గ్రామ అధ్యక్షుడు బంద్రు సిద్దులు, మాజీ సర్పంచ్ అంబాల అంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, గోదల వంశీధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సంకటి యాదగిరి, గొలుసుల దుర్గాచలం పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు’

పాలకుర్తి : దేవాదుల కాల్వ ద్వారా పంటలకు సాగు నీరు అందించడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డిపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదని శాతపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరబోయిన కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాల్వ పనులను పర్యవేక్షించి, అసంపూర్తిగా ఉన్న పనులకు తన సొంత నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవాలు లేకుండా బీజేపీ మండల నాయకుడు దేవరాజ్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని విమర్శలు చేయడం సరికాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొడకండ్ల : మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ గోదాం సమీపంలో మూలమలుపు వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో రాయపర్తి మండలం బురాన్‌పల్లికి చెందిన సట్ల యాకయ్య గాయపడ్డాడు. ఇదే మార్గంగుండా కారులో వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ గంజి ప్రసాద్‌రెడ్డి ప్రమాదాన్ని గమనించి గాయపడిన యాకయ్యను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు.

బీజేపీ నాయకుల సంబురాలు

చిల్పూరు : తెలంగాణలో రానున్నది బీజేపీ రాజ్యమేనని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఢిల్లీలో బీజేపీ గెలుపొందిన సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు తోకల సంపత్ రెడ్డి, వెలిశాల శ్రీనివాస్, ఊరడి రాజు, తోట రంజిత్, పిట్టల రమేష్, పెండ్యాల దిలీప్, తోట శ్రీనివాస్, ముక్కెర రమేష్, పన్నీరు అశోక్, కన్నె బోయిన రవి, దోరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు క్లస్టర్ స్థాయి సన్నాహక సమావేశం

కొడకండ్ల : మండలంలోని ఎంపీటీసీ క్లస్టర్ స్థాయిలో రేపు(మంగళవారం) బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సోమరాములు, వె ంకటేశ్వర్‌రావు, వెంకటనారాయణ, ఆసీఫ్, ప్రేమ్‌కుమార్, రాజిరెడ్డి, ప్రభాకర్, సతీష్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

పాలకుర్తి : వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను ఈ నెల 11న పాలకుర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సై స్‌జ్ ఇన్‌స్పెక్టర్ బి.సంతోష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేటిధర్నాను జయప్రదం చేయండి

చిల్పూరు : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నేడు (సోమవారం)గొల్ల కురుమల సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదం రమేశ్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో గొర్రెల పెంపకం దారులకు ఎన్‌సీడీఎస్ నిధులు సరిపడా కేటాయించలేదన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో పెంపకం దారులకు సరిపడా నిధులు కేటాయించాలనే డిమాండ్‌తో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్ : పట్టణంలోని హైదరాబాద్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని దర్జీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి శివ పేర్కొన్నారు. ఆదివారం దీక్షలకు ప్రారంభించి మాట్లాడుతూ.. న్యాయమైన దీక్షలకు దర్జీ సంఘం పూర్తి మద్దతు ఉంటుందని, ప్రమాదాలకు గురికాకుండా అండర్‌పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే కలెక్టర్ స్పందించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, పందిళ్ల కళ్యాణి, సిద్ధిరాల ఉపేందర్, కోటయ్య, సంపత్, రేణుక, భవాని తదితరులు పాల్గొన్నారు

గ్రామాభివృద్ధికి పాటుపడుదాం..

బచ్చన్నపేట : మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందేందుకు అందరూ పాటుబడుదామని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలోని దుర్గామాత ఆలయంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జంగిటి విద్యానాథ్, మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, శ్రీనివాస్‌గౌడ్, అబ్బాస్,నర్సింహ యాదవ్, రవి, శివ, గణేష్, రమేష్, శ్రీధర్, ఆంజనేయులు, మధు, కర్ణాకర్‌రెడ్డి, వినయ్, భాస్కర్, విజయ్, సాయిరాం పాల్గొన్నారు.

విరాళం

నర్మెట : మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. కాగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా నర్మెట గౌడ సంఘం సభ్యులు రూ.20,016 లు, బైరోజు భద్రమ్మ రూ.15,016లు, నక్కల రాజు–రన్విత, గోపగోని సులోచన–యాదగిరి, చింతల లావణ్య–రవీందర్ రెడ్డి, దన్నారపు వీణా–సుధాకర్, నవత–భద్రయ్య, నిర్మల–రత్నాకర్, పండుగ పల్లవి–మోహన్, దన్నారపు పద్మ ఆదివారం ఆలయ సమితికి విరాళంగా అందజేశారు.

పెద్దమ్మ గుడిలో పనులు..

చిల్పూరు : మండలంలోని కృష్ణాజీగూడెం పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం మాజీ సర్పంచ్ పుట్ట అంజనీ–రవీందర్‌రెడ్డిలు రూ.1.50 లక్షలతో అభివృద్ధి పనులు చేయించారు.

సన్మానం

జనగామ రూరల్ : మండలంలోని వడ్లకొండ గ్రామపంచాయతీ కార్యదర్శిగా సేవలు అందించి పదవి విరమణ పొందిన దోర్నాల మనోహర్‌ను, నూతనంగా బాధ్యతలు చేపట్టిన మధును పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ముదిరాజ్ సొసైటీ పొదుపు సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. అధ్యక్షుడు రెడ్డబోయిన శీను, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బోయిని సంపత్, కోశాధికారి మూలుకల అశోక్, ములుకల సురేందర్, గోనే సత్తయ్య, బొయిని సిద్దులు, చొడబోయిన ప్రభాకర్, ధర్మయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో బెంచీల ఏర్పాటు



పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం బెంచీలు ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంట రవీందర్ రూ.30వేల విలువైన ఎనిమిది బెంచీలు బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఎస్సై లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల చేయూత



జఫర్‌గఢ్ : జఫర్‌గఢ్‌కు చెందిన మొగిళిపాక మల్లేశం ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1997–98 పదో తరగతికి చెందిన తోటిమిత్రులు బాధిత కుటుంబానికి రూ.31వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భవిష్యత్‌లోను మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని వారు తెలిపారు.

ఆర్థికసాయం

చిల్పూరు : మండలంలోని పల్లగుట్టకు చెందిన గాడుదల కట్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆదివారం చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం పంపగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, రత్నాకర్ రెడ్డి, నాయకులు బాధితులకు అందజేశారు.

ఎర్రయ్య మృతి తీరని లోటు

పాలకుర్తి : మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బెల్లి ఎర్రయ్య (80) మృతి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ పేద వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మాసంపల్లి నాగయ్య, ఈదునూరి మదార్, జ్యోతి, ఉపేందర్, బెల్లి సంపత్, పనికిరాని రాజు, శ్రీలత, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన జక్కుల గట్టమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం సీపీఎం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇరు కుటుంబాలపై కేసు నమోదు

చిల్పూరు : ఇరు కుటుంబాల మధ్య తలెత్తిన ఘర్షణలో పరస్పర దాడికి పాల్పడగా ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కొమ్మురాజుల రాణికి, రాజశేఖర్‌తో నాలుగేళ్ల ఏళ్ల క్రితం వివాహం కాగా వారికి కుమార్తె ఉంది. అదనపు కట్నం కోసం కొద్దిరోజులుగా రాజశేఖర్ భార్య రాణిని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో రాణి తల్లిదండ్రులు శనివారం రాత్రి మల్కాపూర్ గ్రామానికి రాగా వారి మధ్య మాటామాటా పెరిగి దాడులకు పాల్పడ్డారు. కాగా ఆదివారం శివరాత్రి వెంకట్రాజం, కొమ్మురాజుల రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు కుటుంబాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్యకర్తను కోల్పోవడం బాధాకరం: కడియం శ్రీహరి



చిల్పూరు : పార్టీకోసం నిత్యం పాటుపడే కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం స్వగ్రామమైన రాజవరంలో అంత్యక్రియలు నిర్వహించగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మారజోజు రాంబాబు, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిద వెంకన్న పాల్గొన్నారు. కాగా కార్యకర్త శ్యాంకుమార్ పాడెను కడియం, జంగాలు మోశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, సురేష్, లింగారెడ్డి, బాలరాజు, ఇల్లందుల యాదగిరి, వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నాయకులు పాల్గొన్నారు.